క్లుప్తంగా

జొన్నాడ పైడితల్లి హుండీల ఆదాయం రూ. 6,54,468



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, తదితరులు

డెంకాడ: జొన్నాడ పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీదారు జి.శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. ఇటీవల అమ్మవారి వార్షిక జాతర మూడు రోజుల పాటు జరిగింది. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకు హుండీల ద్వారా వచ్చే ఆదాయం లెక్కించగా.. 6,54,468 రూపాయలు వచ్చిందని ఆలయ ఏకసభ్య ధర్మకర్త జి. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామపెద్దలు, భక్తులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కుమిలి ద్వాదశ దేవాలయంలో పందిరాట

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి ద్వాదశ దేవాలయంలో శుక్రవారం పందిరాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నీలాపు రాజారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం 8.28 గంటలకు పందిరాట కార్యక్రమం చేపడతామని, భక్తులందరూ హాజరు కావాలని కోరారు.

అనుమతి మేరకే భవన నిర్మాణాలు

నెల్లిమర్ల: పట్టణవాసులు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకున్న మేరకు మాత్రమే భవన నిర్మాణాలు చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి ఎటువంటి పరిశీలన లేకుండా అనుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీని కోసం ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. ఆన్‌లైన్‌లో కావాల్సిన ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసి, ప్రొసీడింగ్ పొందడం ద్వారా భవన నిర్మాణాలు చేపట్టవచ్చన్నారు. అనుమతి పొందిన ప్లాన్‌కి విరుద్ధంగా నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని వేణుగోపాలపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, బాలికల పాఠశాలలో ఐదు, ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్థానికంగా ఉన్న అంబేడ్కర్ గురుకులాలను సంప్రదించాలన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ, గ్రామాల్లో ఎక్కడైనా బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బి. గణేష్ హెచ్చరించారు. పట్టణంలోని డైట్ కాలనీ, పూడమ్మతల్లి ఆలయ పరిసరాలు, థామస్‌పేట చంపావతి నదీతీరంలో పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే రాయితీలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ హర్షలత

విజయనగరం రూరల్: రైతుసేవా కేంద్రాలలో రైతులు విశిష్ట సంఖ్య కోసం వివరాలు నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి పొందాల్సిన రాయితీలకు అర్హులవుతారని మండల వ్యవసాయశాఖాధికారి హర్షలత అన్నారు. మండలంలోని రాకోడు రైతుసేవా కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులందరూ తమ వివరాలు నమోదు చేసుకుంటే ప్రభుత్వం ఒక విశిష్ట సంఖ్య కేటాయిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆమెతో పాటు రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

• సెంచూరియన్‌లో ప్రాంగణ ఎంపికలు..



నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో న్యూఢిల్లీకి చెందిన క్రిక్ టెక్నాలజీ సంస్థ గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. నోడ్ జావా స్క్రిప్ట్, రియాక్ట్ జావా స్క్రిప్ట్, రియాక్ట్ నేటివ్, జేడీ అనలిస్ట్, సోషల్ మీడియా, సేల్స్ ఎగ్జిక్యూటివ్, తదితర ఉద్యోగాలకు నియామకాలు జరిపింది. వర్సిటీలో చదువుతున్న 120 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో సంస్థ సీఈఓ తన్వీ దామిజ, సంస్థ డైరెక్టర్ సోమనాథ్ దామిజ, నిధి, అభిషేక్ కుమార్, వీసీ ప్రశాంతకుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

• వలంటీర్లకు న్యాయం చేయాలి..



లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన వలంటీర్లకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లందరికీ న్యాయం చేస్తామని చంద్రబాబు చెప్పిన మాటలు నమ్మి రాష్ట్రంలో లక్షా 65 వేల మంది రాజీనామా చేయకుండా ఇంకా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈమేరకు దాసన్నపేట రైతుబజార్ జంక్షన్‌లో పలువురు వలంటీర్లు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. – విజయనగరం పూల్‌బాగ్

• కనీస పింఛన్ అమలు చేయాలి..



కనీస పింఛన్‌గా రూ. 9 వేలు ఇవ్వాలని ఈపీఎస్ పింఛన్‌దారుల సంఘ జిల్లా నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పింఛన్‌దారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక మొయిద జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కార్మికుల సొమ్ము లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం తన దగ్గర ఉంచుకుని కేవలం రూ. 1000, రూ. 1500 పింఛన్ ఇవ్వడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కనకల పద్మనాభం, మొయిద పాపారావు, సుద్దాపు రమణ, జరజాపు ప్రకాష్, ఎం. సన్యాసి రావు, కె. ముత్యాలనాయుడు, జె. అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల

• చెత్తాచెదారాల తొలగింపు..



నగరంలోని గంటస్తంభం ప్రాంతంలో ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ప్రజారోగ్య సిబ్బంది గురువారం తొలగించారు. జేసీబీ సహాయంతో భారీ స్థాయిలో మురుగును ప్రక్షాళన చేశారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగిస్తున్నారు. – విజయనగరం

నత్తనడకన రీ సర్వే



మలిచెర్ల గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బంది

విజయనగరం రూరల్: మండలంలోని మలిచెర్ల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని రెవెన్యూ అధికారులు నెల రోజుల కిందట చేపట్టిన రీ సర్వే నత్తనడకన సాగుతోంది. అప్పటి నుంచి నాలుగు టీమ్‌లు గ్రామమంతా సర్వే చేపడుతున్నా.. ఇంకా ఒక కొలిక్కి రాలేదు. స్థానిక సచివాలయంలో ఉన్న సర్వేయర్, వీఆర్‌ఓలతో పాటు అదనంగా ఇతర గ్రామాల నుంచి మరి కొంతమంది సర్వేయర్లు వచ్చి సర్వే చేపడుతున్నా నేటికీ పూర్తి కాలేదు. గ్రామంలో 211 సర్వే నంబర్లు ఉండగా గురువారం నాటికి కేవలం 83 సర్వే నంబర్ల వరకు మాత్రమే సర్వే జరిగిందని సిబ్బంది తెలిపారు. సంబంధిత తహసీల్దార్, ఉన్నతాధికారులు మాత్రం ఫిబ్రవరి నెలాఖరునాటికి గ్రామంలోని రీసర్వే పూర్తి చేయాలని చెబుతున్నా, ఆచరణలో అమలు కావడం లేదు.

మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించండి



వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు

విజయనగరం అర్బన్: జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు వినతి పత్రం అందజేశారు. విజయనగరంలోని కమిషన్ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్‌ను శ్రీనివాసరావు గురువారం కలిసి సమస్యలు విన్నవించారు. పట్టణంలోని పద్మావతినగరలో బాలుర వసతిగృహం, మహిళా ప్రాంగణంలోని వసతి గృహంతో పాటు రాజాంలోని బాలికల కళాశాల వసతిగృహంలో మరమ్మతులు చేపట్టాల్సి ఉందని శ్రీనివాసరావు తెలిపారు. దీనికి కమిషన్ చైర్మన్ స్పందిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

స్వమిత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మండల పంచాయతీ అధికారి జ్ఞానేశ్వరరావు

పూసపాటిరేగ: స్వమిత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పంచాయతీ అధికారి జ్ఞానేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఆస్తుల సమగ్ర ధ్రువీకరణే స్వమిత్వ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. సరిహద్దులు గుర్తించి భూయజమాని పేరు నమోదు చేస్తారని తెలిపారు. దేశంలో ఇప్పటివరకు హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ఈ పథకం అమలులో ఉందన్నారు. ఈ పథకం పూర్తి స్థాయిలో అమలైతే గ్రామాల్లో భూసమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్ష్మీరామదాసుకు సత్కారం



లక్ష్మీరామదాసును సత్కరిస్తున్న కళాసంస్థల ప్రతినిధులు

విజయనగరం టౌన్: జిల్లాకు చెందిన వరలక్ష్మీ త్యాగరాజ సంగీత నృత్య కళానికేతన్ అధ్యక్షుడు మహేంద్రవాడ లక్ష్మీరామదాసుకు సంగీత నృత్య సేవా తపస్వి అనే బిరుదుతో బుధవారం రాత్రి విజయవాడలో సత్కరించారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థలైన తెలుగు కళావాహిని, కామ్రేడ్ పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి, సంగీత సామ్రాట్ కళాసంస్థ, కేవీ బ్రహ్మానందం కళా సంస్థ సంయుక్తంగా అవార్డు ప్రదానం చేశాయి.

పరిసరాలు పరిశుభ్రం..



21వ డివిజన్‌లో వీధులను పరిశీలిస్తున్న నగర పాలక కమిషనర్ నల్లనయ్య, తదితరులు

• కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని 21వ డివిజన్‌లో గురువారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. నాగవంశం కల్యాణ మండపం నుంచి ప్రారంభమైన డివిజన్ పర్యటనలో పలు సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను చూసి వెంటనే సదరు యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కొన్నిచోట్ల భవన నిర్మాణ వ్యర్థాలను చూసి సంబంధిత కార్యదర్శులను మందలించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, డీఈ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీలతో నేర నియంత్రణ..



ఎంఎస్పీలతో సమావేశమైన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఫైల్)

విజయనగరం క్రైమ్ : నేర నియంత్రణకు ఎంఎస్‌పీల (మహిళా సంరక్షణ పోలీసులు) సహకారం తీసుకోవాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పోలీస్ పెద్దల ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఎంఎస్‌పీలతో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఇటీవల సమావేశమయ్యారు. వాస్తవానికి ఎంఎస్‌పీ వ్యవస్థను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖకు చేదోడు వాదోడుగా ఉంటూ నేరాల నియంత్రణకు సహకరించాలనే ఉద్దేశంతో ఈ మహిళా సంరక్షణ పోలీసుల వింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ వింగ్‌లో చేరిన వారు పోలీస్ వ్యవస్థకు ఎంతో సహకారం అందించారు. అయితే అనంతర కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పాలనా పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలవుతున్నా ఎంఎస్‌పీల సంగతి పట్టించుకోలేదు. ఒకరకంగా చెప్పాలంటే మహిళా సంరక్షణ పోలీసులంతా వైఎస్సార్‌సీపీకి చెందిని వారేనన్న వ్యాఖ్యలు కూడా వినిపించాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమను ఎవ్వరూ పట్టించుకోవడం ఎంఎస్‌పీలు వాపోతున్నారు. ఈ తరుణంలో ఎంఎస్పీలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రంలో అన్ని జిల్లాల పోలీస్ బాస్‌లకు మౌఖికపరమైన ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎంఎస్‌పీలతో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సమావేశమయ్యారు. ముస్ముందు కూటమి ప్రభుత్వం ఎంఎస్పీలను ఏ విధంగా వినియోగించుకుంటుందో చూడలి మరి.

కొత్తకొప్పెర్లలో అగ్ని ప్రమాదం



కొబ్బరితోటలో చెలరేగుతున్న మంటలు

పూసపాటిరేగ: మండలంలోని కొత్తకొప్పెర్లలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో కొబ్బరి, మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన అడ్డాగార్ల గోపికి చెందిన కొబ్బరి, మామిడి తోట అగ్నికి కాలిపోయింది. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. విజయనగరం నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

షార్ట్‌ఫిల్మ్ పోస్టర్ రిలీజ్



పోస్టర్ రిలీజ్ చేస్తున్న అవనాపు విక్రమ్, నఖుల్ వర్మ

విజయనగరం టౌన్: మేడ్ సినీ ప్రొడక్షన్ నిర్మించిన 'భ్రమ' షార్ట్ ఫిల్మ్ ఈ నెల 14న రిలీజ్ అవుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ పోస్టర్‌ను గురువారం రిలీజ్ చేసింది. జిల్లా కేంద్రంలోని మైత్రీ మీడియా కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలోమైత్రీ మీడియా డైరెక్టర్లు అవనాపు విక్రమ్, ముదునూరు నఖుల్ వర్మ పోస్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో డైరెక్టర్ కృష్ణ మంగిపూడి, నిర్మాత రోహిత్య జామి, హీరో రాజేష్, ఫొటోగ్రఫీ డైరెక్టర్లు వసంత్, లక్ష్మణ్, ప్రొడక్షన్ టీమ్ జగదీష్ దాస్, నవీన్ పెంటకోట, తదితరులు పాల్గొన్నారు.

గతంలో పనిచేసే చోటే అవకాశం

విజయనగరం ఫోర్ట్: గజపతినగరం మండలం రామన్నపేటకు చెందిన అంగన్‌వాడీ హెల్పర్ మానాపురం సౌజన్యకు ఆమె పని చేసిన చోటే రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఉద్యోగంలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఆమెపై విచారణ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. విచారణ అధికారిగా నియమితులైన ఐసీడీఎస్ పీడీ వద్ద సౌజన్య తన వాదనను వినిపించాల్సి ఉంటుందన్నారు. విచారణ అనంతరం ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు.

త్వరితగతిన జియో ట్యాగింగ్

• కమిషనర్ నల్లనయ్య



మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలైన ఎంఎస్ఎంఈ సర్వే, మిస్సింగ్ సిటిజన్, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లన్నయ్య ఆదేశించారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మిస్సింగ్ సిటిజన్, ఎంప్లాయిస్ వివరాలతో పాటు ఎంఎస్ఎంఈ వివరాలను శతశాతం నమోదు చేసుకోవాలన్నారు. చిన్న వ్యాపారస్తుల నుంచి 100 కోట్ల రూపాయల పైబడి వ్యాపారం చేస్తున్న సంస్థల వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే విద్యుత్ వినియోగదారుల వివరాలను కూడా నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో కార్యదర్శులు చురుకైన పాత్రను పోషించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో టీపీఆర్‌ఓ సింహాచలం, ఏఓ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

• పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పవన్ గుప్తా



మాట్లాడుతున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసిస్టెంట్ జనర్ మేనేజర్ పవన్ గుప్తా

విజయనగరం అర్బన్: బ్యాంక్ అందిస్తున్న ఎంఎస్ఎంఈ రుణాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని పంజాబ్ నేషనల్ బ్యాంక్ అసిస్టెంట్ జనర్ మేనేజర్ పవన్ గుప్తా కోరారు. గురువారం స్థానిక బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ఎంఎస్ఎంఈ లోన్ ఎక్స్ పో–2025' ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారవర్గాలకు అనువైన వడ్డీ రేట్లలో రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ కె.సుభాష్ , రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బలగం వెంకట్‌రావు, బాలాజీ మార్కెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరావు, వైజాగ్ చీఫ్ మేనేజర్ బిషప్‌కుమార్, విజయనగరం బ్రాంచ్ హెడ్ గంగు సంతోష్, అరుణ్‌కుమార్, రాజశేఖర్, తేజ, క్రెడాయ్ సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సత్తా ఉన్నవారికే అవకాశం ..



పాకలపాటికి మద్దతు తెలియజేస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగాల సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించి, పరిష్కరించగలిగే సత్తా ఉన్నవారికే ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె. జోగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ పడుతున్న పాకలపాటి రఘువర్మకు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.మురళీ, సహాధ్యక్షులు ఎస్.చిట్టిబాబు, కె.శంకర రావు, తదితరులు పాల్గొన్నారు.